సాక్షి వికారాబాద్

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



మామూళ్ల మత్తు..

పర్సెంటేజీల మత్తులో పడి అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారు.

8లో▸



అనంతగిరి: స్వామికి అభిషేకం చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



మోమిన్‌పేటలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



తాండూరు టౌన్ : అంతప్పబావి ఆలయంలో పుష్పాలతో నిలువెత్తు శివలింగం



అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



సర్వం శివమయం

హరహర మహాదేవ.. శంభో శంకర.. అంటూ భక్తజనం తన్మయత్వంలో మునిగిపోయారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామివారి దర్శనం కోసం క్యూకట్టారు. అభిషేకాలు, అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పొద్దంతా ఉపవాస దీక్షలు ఆచరించి, రాత్రివేళ జాగారం చేశారు.



తాండూరు రూరల్: అంతారంతండా భూకైలాస్‌లో భక్తుల కిటకిట

న్యూస్‌రీల్

బంగారు పతకం సాధించడం గర్వకారణం



హఫీజ్‌ను అభినందిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 7వ మాస్టర్ గేమ్స్ స్టేట్ చాంపియన్ షిప్‌లో 70 ఏళ్లు పైబడిన కేటగిరిలో వికారాబాద్‌కు చెందిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎండీ హఫీజ్ జావెలిన్‌త్రోలో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో బుధవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆయన్ని వికారాబాద్‌లో సన్మానించారు. ఈ వయసులో బంగారు పతకం సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, తస్వర్ అలీ, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా ట్రైలర్ విడుదల

వికారాబాద్ ప్రాంతవాసి నరసింహారావు నిర్మించిన శివశంభో సినిమా ట్రైలర్‌ను బుధవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ విడుదల చేశారు. ఈ మేరకు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆవిష్కరించి ఆల్‌దిబెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు చెక్కుల అందజేత



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన జన్మదినం పురస్కరించుకొని వికారాబాద్‌లోని బుగ్గ రామలింగేశ్వర స్వామిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ తరఫున ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు రూ.2,500 చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వడ్లనందు, రాజునాయక్, బస్వలింగం తదితరులు పాల్గొన్నారు.

మోకిలలో కారు బీభత్సం

శంకర్‌పల్లి: అతివేగం.. అజాగ్రత్తగా నడపడంతో కారు అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అపస్మారకస్థితిలో ఉండగా మరో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్ తెలిపిన ప్రకారం.. మండలంలోని ప్రొద్దటూరు గ్రామానికి చెందిన ఎ.సురేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి రాజేంద్రనగర్ పరిధి వట్టినాగులపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి, మల్లేశం కలిసి శంకర్‌పల్లికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో అతివేగంగా వెళ్తుండగా మోకిల విజేత సూపర్ మార్కెట్ ఎదుట ఇద్దరు ద్విచక్రవాహనదారులను ఢీకొడుతూ ముందుకెళ్లి ఓ లారీని ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కొండాపూర్‌కు చెందిన శ్రీనివాస్(30), లింగంపల్లికి చెందిన చంద్రసింగ్(31) బైక్‌పై నుంచి ఎగిరి కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. క్షతగాత్రులు ఇద్దరూ అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వన్యప్రాణుల దాహం తీరేలా



అడవిలో ఏర్పాటు చేసిన నీటి కొలనులో నీరు తాగుతున్న వన్యప్రాణులు

జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో 108 సాసర్ పిట్స్

- నీటి సరఫరాకు సోలార్ పంప్ సెట్ల బిగింపు
- అడవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక నజర్

అటవీ విస్తీర్ణం:	**1,08,000** ఎకరాలు
5 క్లస్టర్లు	**94** బ్లాకులు
దట్టమైన అడవులు:	**15,000** ఎకరాలు
పక్షి జాతులు:	**128** రకాలు
ఔషధ మొక్కలు:	**50,000**

వికారాబాద్: ఎండల తీవ్రత రోజురోజుకూ అధికమవుతుండటంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అడవుల్లో సంచరించే వన్యప్రాణులు, ఇతర పశుపక్ష్యాదుల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన సాసర్ పిట్స్(నీటి తొట్టిల్లో నీటిని నింపే కార్యక్రమం) ప్రారంభించారు. దీనికి పలుచోట్ల సోలార్ పంపుసెట్లు సైతం ఏర్పాటు చేశారు. మొత్తం 108 సాసర్ పిట్స్ నిర్మించి అందులో నీటిని నింపుతున్నారు. అయితే ఇటీవల అడవిలో చోటు చేసుకుంటున్న అగ్ని ప్రమాదాలు వన్యప్రాణులకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి. ఇందులో కొన్ని మానవ ప్రమేయంతో జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయం. మరోవైపు వేటగాళ్ల జంతువుల పాలిట యమపాశాలుగా మారుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.


చిరుతల సంచారం

జిల్లాలో 1,08,000 ఎకరాల విస్తీర్ణంలో అటవీ భూములు ఉండగా.. మొత్తంగా భౌగోళికంగా 13 శాతంగా ఉంది. ఇందులో 15 వేల ఎకరాల్లో దట్టమైన అడవులున్నాయి. ఈ అటవీ ప్రాంతాన్ని ఐదు క్లస్టర్లు, 94 బ్లాకులుగా విభజించగా ఇందులో అనంతగిరి ప్రాంతం ముఖ్యమైనది. కుల్కచర్ల, చించోలి ప్రాంతంలో చిరుత పులుల సంచారం ఉంది. అనంతగిరిలో ప్రధానంగా హైనాలు, దుప్పులు, దున్నలు, కొండగొర్రెలు, జింకలు తదితర జంతు జాతులు ఉన్నాయని అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఓ పక్క ప్రభుత్వం అటవీ విస్తీర్ణం పెంచేందుకు హరితహారం లాంటి కార్యక్రమాలను అమలు చేస్తుంది. మరోవైపు అధికారుల నిర్లక్ష్యం, కబ్జాకోరుల కారణంగా రోజురోజుకూ అడవి తగ్గిపోతుంది. దీంతో వన్యప్రాణుల జీవనానికి ఆటంకం ఏర్పడుతున్నాయి.

ఔషధ మొక్కలకు ప్రసిద్ధి

ఇక్కడి అడవుల్లో ఫారెస్టు అధికారులు అనేక ప్రత్యేకతలు గుర్తించారు. ప్రధానంగా 128 రకాల పక్షి జాతులున్నాయి. అందులో ఆరెంజ్ తల కలిగిన ట్రస్టు (ఆరెంజ్ హెడెడ్ ట్రస్టు), నల్ల టోపిగల మోనార్క్(బ్లాక్ నెపేడ్ మోనార్క్), నెమళ్లు, చిలుక, కోకిల, గోరువంక, పాలపిట్ట తదితర పక్షిజాతులు ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న అనంతగిరి అడవులను ఔషధ వనంగా పిలుస్తారు. ఇందులో సహజసిద్ధంగా పెరిగిన 300 రకాల ఔషధ మొక్కలు ఉన్నాయి. ఫారెస్టు అధికారులు మరో 18 రకాలకు చెందిన 50 వేల ఔషధ మొక్కలు నాటి పెంచుతున్నారు. అనంతగిరి అడవులు, కొండలు, ఔషధ వైద్యులకు రీసెర్చ్ కేంద్రంగా ఉపయోగపడుతుంది. ఎందరో ఔషధ వైద్యులు, విద్యార్థులు ఇక్కడికి తరచూ వచ్చి పరిశోధనలు చేస్తుంటారు.

అందరి సహకారం అవసరం



సహజ సిద్ధమైన వాతావరణం కలిగిన ఈ ప్రాంతాన్ని కాపాడుకోవటానికి అందరి సహకారం అవసరం. వన్యప్రాణులు, కొండలు, అడవుల అందాలను మరింత పెంచే దిశగా చర్యలు చేపడుతున్నాం. జంతువులు, పక్షుల రక్షణ కోసం నీటి కొలనులు ఏర్పాటు చేశాం. నీటి అవసరాలు తీర్చేందుకు చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. ప్లాస్టిక్ వాడకం నిషేధించాం. కొందరు సిగరెట్లు, బీడీలు తాగి అడవిలో పడేస్తుండటంతో అగ్ని ప్రమాదానికి కారణమవుతున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

– జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖ అధికారి

ఆటపాటలతో చదువు



పప్పెట్రీ బొమ్మలు

- పప్పెట్రీ కళతో విద్యార్థులకు బోధన
- సృజనాత్మకత వెలికితీసేందుకు దోహదం
- కృత్యాధార పద్ధతులతో ఆహ్లాదకరమైన అభ్యసన
- కేంద్ర ప్రభుత్వం తరఫున రిసోర్స్ పర్సన్లకు శిక్షణ

పప్పెట్రీ కళలో నాలుగు భాగాలు

❖ రోడ్ పప్పెట్ ❖ షాడో పప్పెట్

❖ ఫింగర్ పప్పెట్ ❖ మొప్పెట్/స్ట్రింగ్ పప్పెట్

బొంరాస్‌పేట: 'దండన విద్యకు దూరం.. ఆహ్లాదంతో అభ్యాసం' అనే ప్రధాన ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు అవసరమయ్యే కళారూపాలతో విద్యాబోధన కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రభుత్వ బడుల్లో ప్రధానంగా 1నుంచి 5 తరగతుల చిన్నారులకు ఆటపాటలతో చదువు నేర్పడం, విద్యపట్ల ఆకర్షణ పెంపొందించేందుకు కృత్యాధార పద్ధతులు ఎంతో ఉపయోగపడుతాయి. వాటిలో పప్పెట్రీ (చేతికి తొడిగించుకునే తోలుబొమ్మలు) ప్రదర్శన ముఖ్యమైనది. కథలు, పాటలు, పాఠాలను విద్యార్థులకు కృత్యాధార పద్ధతులతో విద్యాభ్యాసం చేస్తూ పాఠశాల వైపు ఆకర్షిస్తున్నారు. కార్పొరేట్ విద్య ఒత్తిడికి గురిచేస్తూ సామాజిక అంశాలను దూరం చేస్తున్న నేపథ్యంలో పప్పెట్రీ ప్రదర్శన విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీస్తోంది.

ఆర్పీల్లో నైపుణ్యం

జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండలాలవారీగా ఉన్న రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ)లకు నైపుణ్యం ఇచ్చేందుకు పప్పెట్రీ ప్రత్యేక శ్రద్ధ చూసుతోంది. ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు ఇటీవల భారత ప్రభుత్వ సాంస్కృతిక సంస్థ, సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్స్ అండ్ ట్రెనింగ్(సీసీఆర్‌టీ) న్యూఢిల్లీలో రోల్ ఆఫ్ పప్పెట్రీ ఇన్ ఎడ్యుకేషన్ ఇన్ లైన్ విత్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్‌పీఈ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ పాలసీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా పప్పెట్రీ పాత్ర ప్రధానమైందని భావించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల పాఠశాలల్లో పప్పెట్రీ విధానం విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఇటీవల న్యూ ఢిల్లీలో శిక్షణ

పప్పెట్రీ విధానం విద్యార్థుల్లో సజనాత్మకతను వెలికితీస్తోంది. పప్పెట్రీల తయారీ, కొత్త కథలు, ప్రదర్శన పద్ధతులు వంటి మరెన్నో విద్యార్థులు సొంతంగా సృష్టించుకోగలరు. న్యూఢిల్లీలోని సీసీఆర్‌టీ హెడ్ క్వార్టర్స్‌లో ఈనెల 6 నుంచి 20 వరకు శిక్షణ ఇచ్చారు. ఇందులో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 59 మంది టీచర్లు ఉండగా తెలంగాణ తరఫున వికారాబాద్‌తోపాటు మంచిర్యాల, ఆదిలాబాద్, గద్వాల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన తొమ్మిది మంది ఉన్నారు.



న్యూఢిల్లీ వేదికపై తెలంగాణ ఆర్పీల పప్పెట్రీ ప్రదర్శన

జిల్లా నుంచి ఒక్కడినే



శిక్షణకు రాష్ట్రం మొత్తంలో 9మంది కాగా మన జిల్లా నుంచి నేనొక్కడినే ఎంపికయ్యా. అందుకు డీఈఓ, ఏఎంఓలకు కృతజ్ఞతలు. పప్పెట్రీ షోలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉంది. పప్పెట్రీలను తయారు చేసి పాఠశాలలో ఈ కళను ఉపయోగించి విద్యార్థుల ప్రగతికి తోడ్పడతా. ఇలాంటి ప్రదర్శనలు విద్యాబోధనను సులభతరం చేస్తాయి.

– నరేందర్‌గౌడ్, ఉపాధ్యాయుడు, యూపీఎస్, వడిచర్ల

చోరీకి వచ్చి హత్య

- వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- మెడలోని బంగారం లాక్కొని బావిలోకి తోసేసిన నిందితులు
- ముగ్గురికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: మర్పల్లి మండలంలో జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు కారణమైన ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మర్పల్లి మండలం కోటమర్పల్లికి చెందిన తోకల వినోద(60) ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈమె ఇద్దరు కూతుళ్లకు వివాహం చేయగా, కోవిడ్ సమయంలో భర్త కమాల్‌రెడ్డి మృతిచెందాడు. ఈనెల 24న వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. ఇదే గ్రామానికి చెందిన సొన్నైల రాజు, షఫియుద్దీన్, నర్సింలు అనే ముగ్గురు పేకాట ఆడుతూ మద్యానికి బానిసలై సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఒంటరిగా నివాసం ఉంటున్న వృద్ధురాలి ఇంట్లో దొంగతనం చేయాలని పథకం వేశారు. ఈనెల 23న అర్ధరాత్రి వరకు పేకాట ఆడి, మద్యం తాగి వినోద ఇంట్లోకి చొరబడ్డారు. గడ్డపారతో అలమారా తాళం పగులగొడుతున్న తరుణంలో శబ్దం రావడంతో వృద్ధురాలు మేల్కొంది. లైట్ వేయడంతో నిందితులు కనిపించారు. తెలిసినవారే కావడంతో తమ బండారం బయటపడుతుందని భావించారు. వృద్ధురాలిని చంపి ఆమె వద్ద ఉన్న బంగారం, డబ్బులు లాక్కెళ్లాలని నిర్ణయించుకున్నారు. మెడలో ఉన్న బంగారు లాకెట్‌ను లాక్కుని, ఆమెను ఇంటి ఆవరణలోని బావిలోకి తోసేశారు. చనిపోయిందని నిర్ధారించుకున్న అనంతరం ఇంట్లోకి వెళ్లి బీరువాలోని రూ.21 వేలు తీసుకుని, బీరువాకు నిప్పంటించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో నిందితులను విచారించగా నిజం ఒప్పుకొన్నారు. ఏ– 1 నిందితుడు రాజు 2014లో తన తల్లిని రాయితో కొట్టి చంపిన కేసులో నిందితుడు కావడం గమనార్హం. కేసు ఛేదనలో చురుగ్గా పనిచేసిన మోమిన్‌పేట సీఐ నవీన్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బలవంతయ్య, సీసీసీ బృందం, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఆర్‌టీఆర్‌కు ఆన్‌లైన్ బిడ్డింగ్

- నోటిఫికేషన్ జారీ చేసిన హెచ్ఎండీఏ
- 28న టెండర్ దరఖాస్తుల స్వీకరణ
- మార్చి 21న టెక్నికల్ బిడ్స్ ఓపెన్
- భూముల ధరలకు రెక్కలు



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పొడవు:	41.5 కిలోమీటర్లు
గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు విస్తీర్ణం:	100 మీటర్లు, ఆరు లైన్లు
ఫేజ్–1:	ఓఆర్ఆర్ రావిర్యాల–మీర్‌ఖాన్‌పేట వరకు (19.2కి.మీ)
ప్రాజెక్ట్ అంచనా:	రూ.1,665 కోట్లు
ఫేజ్–2:	మీర్‌ఖాన్‌పేట–ఆమనగల్లు ఆర్ఆర్ఆర్ వరకు(22.30కి.మీ)
ప్రాజెక్ట్ అంచనా:	రూ.2,365 కోట్లు

ఫేజ్–1లో భూ సేకరణ

మండలం	గ్రామం	రైతులు	భూమి(ఎకరాల్లో)
ఇబ్రహీంపట్నం	ఫిరోజ్‌గూడ	84	1.03
ఇబ్రహీంపట్నం	కొంగరకలాన్	361	55.05
మహేశ్వరం	కొంగరకుర్దు	278	53.20
కందుకూరు	లేమూరు	497	84.28
కందుకూరు	తిమ్మాపూర్	290	47.02
కందుకూరు	రాచలూరు	351	87.22
కందుకూరు	గుమ్మడవెల్లి	(రిజర్వ్ ఫారెస్ట్)	32.11
కందుకూరు	పంజాగూడ	(టీఎస్ఐఐసీ)	18.33
కందుకూరు	మీర్‌ఖాన్‌పేట	48	62.08

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన రతన్ టాటా రోడ్డు (గ్రీన్ ఫీల్డ్ రేడియల్) నిర్మాణానికి ఆన్‌లైన్ టెక్నికల్ బిడ్లను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) రెండు రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 28న ఆన్‌లైన్ ద్వారా టెండర్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. మార్చి 21 వరకు ఈ టెక్నికల్ బిడ్స్‌ను తెరవనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను (మొత్తం 41.5 కిలో మీటర్ల రోడ్డుకు 4,725 మంది రైతుల నుంచి 1,004.22 ఎకరాల భూమి) చేపట్టిన విషయం విదితమే. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని 14 గ్రామాల మీదుగా వెళ్లే ఈ రోడ్డును రెండు దశల్లో నిర్మించాలని నిర్ణయించారు. ఫేజ్–1లో ఓఆర్ఆర్ ఎగ్జిట్–13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 19.02 కిలో మీటర్లు రూ.1,665 కోట్ల అంచనా వ్యయంతో పూర్తి చేయనున్నారు. ఫేజ్–2లో భాగంగా మీర్‌ఖాన్‌పేట నుంచి ఆమనగల్లు ఆర్ఆర్ఆర్ వరకు 22.30 కిలోమీటర్లు రూ.2,365 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఈ ఆర్‌టీఆర్(రతన్ టాటా రోడ్డు)కు టెండర్లు కాల్‌ఫర్ చేయడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూముల ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ఇంటిముందు పెట్టిన బైక్ చోరీ

24గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు

కుల్కచర్ల: ఇంటిముందు పెట్టిన బైక్ అపహరణకు గురైన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డె ఎల్లయ్య రోజులాగే తన ఇంటి ముందు బైక్ పెట్టి భోజనం అనంతరం నిద్ర పోయారు. ఉదయం 4:30నిమిషాలకు పొలం దగ్గరకు వెళ్లేందుకు బయటకు రాగా బైక్ కనిపించలేదు. చుట్టుప్రక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో పక్కింటివారి దగ్గర మొబైల్ ఫోన్ కూడా గుర్తుతెలియని వ్యక్తి అపహరించినట్లు తెలిసింది. దీంతో వారు కుల్కచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు చుట్టుప్రక్కల గ్రామస్తులను విచారించారు. దోమ మండలం మోత్కూరు గ్రామానికి చెందిన రాకొండ వెంకటయ్య ఆ బైక్‌పై వెళ్లడం చూశారని చెప్పడంతో అతని ఆచూకీ తెలుసుకొని విచారించారు. ఈ విచారణలో అతను బైక్ దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అతన్ని అరెస్టు చేసి పరిగి సబ్ జైలు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి ఆమనగల్లు పట్టణ సమీపంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సరూర్‌నగర్‌కు చెందిన జయమ్మ(67) కుటుంబ సభ్యులతో కలిసి అచ్చంపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో కాటన్‌మిల్లు వద్ద వృద్ధురాలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి రోడ్డు దాటుతుండగా నగరం నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన ఎండీ ఆసిమ్ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబీకులు వెల్దండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొందుర్గు: బావమరుదులు తనపై దాడిచేశారని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ సంఘటన మండల పరిధి పర్వతాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం .. పర్వతాపూర్ గ్రామానికి చెందిన తోలుకట్టె మల్లేశ్(38) పదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన చిట్టెమ్మను వివాహం చేసుకున్నాడు. నాటి నుంచి వీరి దాంపత్య జీవితంలో తరుచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం దంపతులు గ్రామం వదిలేసి, షాద్‌నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. అక్కడ గొడవలు పెరగడంతో.. విషయాన్ని చిట్టెమ్మ తన సోదరులు శ్రీనివాసు, అమరేందర్‌లకు తెలిపింది. దీంతో ఈ నెల 25న వారిద్దరు మల్లేశ్‌పై దాడిచేశారు. దీంతో మనస్తాపం చెందిన మల్లేశ్.. ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి పెద్ద సత్యమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మామూళ్ల మత్తు.. నాణ్యత చిత్తు!

- సీసీ రోడ్ల నిర్మాణంలో పర్యవేక్షణ లోపం
- పర్సెంటేజీ ఇస్తేనే ఎంబీ రికార్డు
- క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే సంతకాలు
- మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతున్న అంతర్గత రోడ్లు


అంపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు

ధారూరు: పర్సెంటేజీల మత్తులో పడి కొంత మంది పంచాయతీ రాజ్ అధికారులు నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలు, తండాల్లో నిర్మించిన సీసీ రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగా తయారవుతున్నాయి. నిర్మాణ సమయంలో పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు మామూళ్ల ఒరలో చిక్కుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఒక్కో అధికారికి ఒక్కో విధంగా మొత్తం పని వ్యయంలో పర్సంటేజీలుగా ఉంటాయనేది బహిరంగ రహస్యమే. దీంతో సీసీ రోడ్ల నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే రూ.5 లక్షల పనికి రూ.35 వేల నుంచి రూ.40 వేలు వసూలు చేస్తున్నారని స్థానికులు, కాంట్రాక్టర్లు ఆరోపించారు. కేవలం కార్యాలయంలోనే కూర్చుని ఎంబీ రికార్డులు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

నచ్చిన వారిపై తీర్మానాలు

ఇటీవల మండల వ్యాప్తంగా సీసీ రోడ్ల నిర్మాణానికి జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.5.38 కోట్లు విడుదలయ్యాయి. అలాగే చేవెళ్ల ఎంపీ నిధులు వచ్చాయి. పాలకుల సమక్షంలో గ్రామాలు, తండాల్లో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా తీర్మానాలు తీసుకొని తమకు నచ్చిన వారికి పనులు అప్పగించారు. ఇసుక, సిమెంట్, డస్ట్ తదితర వాటిల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఫలితంగా నిర్మించిన కొన్ని రోజులకే రోడ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పనులు పొందిన కాంట్రాక్టర్లు అధికారులతో కుమ్మక్కై అస్తవ్యస్తంగా పనులు చేస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. సీసీ రోడ్ల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ మేరకు ఎంబీ రికార్డులు చేయాల్సి అధికారులు కార్యాలయంలోనే ఆ వ్యవహారమంతా చక్కబెడుతూ కాసులు దండుకుంటున్నారు.

> **ఇదేం కొత్త కాదుగా..!**
> ఈ విషయమై ఓ అధికారిని వివరణ అడగగా ఇదేం కొత్త కాదని, సీసీ రోడ్డే కాదు, బీటీ రోడ్లకు కూడా పర్సెంటేజీలు తీసుకుంటామని సెలవిచ్చారు. తానొక్కడినే తీసుకోవడం లేదని, తన పేరు రాయొద్దని చెప్పడం గమనార్హం.

పెండింగ్‌లో బిల్లులు

లంచాలకు వేదిక వికారాబాద్‌లోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం మారిందని, ప్రతి టేబుల్ వద్ద పర్సంటేజీలను బహిరంగంగానే వసూలు చేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్సంటేజీలు ఇవ్వని వారి ఎంబీలు నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారని, కక్షతో తక్కువ బిల్లు చేసి నష్టం వచ్చేలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంజూరైన నిధుల్లో పర్సంటేజీల రూపంలో దోచుకుంటున్నారని ఆరోపించారు. నాణ్యత లేని సీసీ రోడ్లు వేసినా కనీసం వాటర్ క్యూరింగ్ కూడా సరిగ్గా చేయలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. మండలంలోని అంపల్లిలో సీసీ రోడ్డు వేసి నాలుగు రోజుల తర్వాత వాటర్ క్యూరింగ్ మొదలు పెట్టారని స్థానికులు వాపోయారు. మండల వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే దర్శనమిస్తోంది. అధికారులు సైతం పర్సంటేజీల విషయంపై మాట్లాడటానికి విముఖత చూపుతున్నారు.

ఉపాధిహామీ పనులను ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బుగ్గప్ప

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప

పరిగి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని గ్రామాల్లో వెంటనే ఉపాధిహామీ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా వ్యవసాయ కార్మికులకు ఆత్మీయభరోసా కింద సంవత్సరానికి రూ.12వేలు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇష్టానుసారంగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఉపాధి కూలీలకు పని దినాలను 200 రోజులకు పెంచి ప్రతీ రోజు రూ.600 చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలో ఉపాధి పనులను నిర్వహించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, నాయకులు సత్తయ్య, రఘురాం, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

200 పనిదినాలు కల్పించాలి...

మర్పల్లి: ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఉపాధి కూలీలకు ప్రతి సంవత్సరం 200 పనిదినాలు కల్పించాలని, రోజువారి కూలి రూ. 600లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని సిరిపూరం గ్రామంలో సీపీఎం శాఖ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాసయ్య అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్ మైపాల్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నిరుపేదలకు ఇండ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.20లక్షలు ప్రభుత్వం అందజేయాలన్నారు. ప్రతి గ్రామంలో అంతర్గత రోడ్లను అభివృద్ధి పర్చాలన్నారు. కార్మికులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మరావు, ఎన్ బాబు, కే బాబు, మాణయ్య, కృష్ణ, ఆంజనేయులు, పాండు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు

కరన్‌కోట్ గ్రామంలో ఘటన


అంజిలప్ప (ఫైల్)


తాండూరు రూరల్: అదృశ్యమైన ఓ వ్యక్తి నీటిగుంటలో శవమై తేలిన సంఘటన మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్ రెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పరుసన్‌గారి అంజిలప్ప(39) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన ఈ నెల 24న ఉదయం తలనొప్పి వస్తోందని మాత్ర తెచ్చుకుంటానని ఇంటి నుంచి వెళ్లాడు. అటు నుంచే పనికి వెళ్తానని భార్య అంజమ్మకు చెప్పాడు. ఆ తర్వాత నుంచి ఆయన ఆచూకీ లభించలేదు. ఏమయ్యాడో తెలియక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం కరన్‌కోట్ నుంచి జీవన్గి వెళ్లే మార్గంలోని నీటిగుంటలో ఓ మృతదేహం ఉందని స్థానికులు తెలపగా అక్కడికి వెళ్లి పరిశీలించారు. దాన్ని అంజిలప్ప మృతదేహంగా గుర్తించారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. టీచర్‌కు రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రేమ పేరుతో వేధిస్తున్న ఉపాధ్యాయుడిపై కేసు నమోదు, చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాదర్‌గూల్‌లోని సెయింట్ మాథ్యూస్ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలిక(15)ను ఇదే స్కూల్‌లో పనిచేస్తున్న ఫిజిక్స్ టీచర్ మహేశ్ కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. విద్యార్థిని ఫోన్ నంబర్ తీసుకుని తరచూ మాట్లాడుతూ.. అసభ్యకరంగా ప్రవర్తించే వాడు. విషయం ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించాడు. ఈ క్రమంలో బాలిక ఈ నెల 24న ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చింది. స్కూల్‌కు వెళ్లాలని లేదని, ఉపాధ్యాయుడు వేధింపులకు గురి చేస్తున్నాడని చెప్పింది. దీంతో తల్లిదండ్రులు ఈ నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. మహేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతన్ని న్యాయస్థానంలో ప్రవేశపెట్టి, రిమాండ్‌కు తరలించారు.

‘శివన్నగూడ’కు మరోసారి భూసేకరణ

ప్రకటన విడుదల చేసిన ప్రభుత్వం


శివన్నగూడ రిజర్వాయర్

మంచాల: శివన్నగూడ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా మరోసారి ప్రభుత్వం భూసేకరణ చేయనుంది. అందుకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా శివన్నగూడ రిజర్వాయర్ కోసం మంచాల మండల రెవెన్యూ పరిధి శ్రీమంత్‌గూడలో భూసేకరణ చేయనుంది. ఇక్కడ 267 మంది రైతులకు సంబంధించిన సర్వే నంబర్ 40 నుంచి 66లో గల 148.31 ఎకరాలను సేకరించనుంది. కేంద్ర భూసేకరణ చట్టం 2013 ప్రకారం నిర్వాసితులకు పునరావాస కల్పన కోసం నష్ట పరిహారం చెల్లించనున్నట్లు తెలిపింది. అదే విధంగా ఆ భూముల్లో సర్వే అనంతరం, కొలతలు తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భూ సేకరణలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా.. 60 రోజుల్లోగా మంచాల తహసీల్దార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం లేదా రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలపాలని కోరింది.

విధులకు డుమ్మా.. వేతనం విత్ డ్రా

పనిచేయకుండా.. జీతం తీసుకున్న టీచర్



తుక్కుగూడ: మూడు నెలలుగా విధులకు వెళ్లకుండా.. ఓ టీచర్ నెలనెలా వేతనం తీసుకున్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో.. సుగుణ ఉపాధ్యాయురాలుగా పని చేస్తోంది. ఈమె గతేడాది నవంబర్ 2 నుంచి అర్హత కలిగిన సెలవులు ఉన్నాయంటూ లీవు పెట్టింది. అప్పటి నుంచి ఈ నెల 19 వరకు పాఠశాలకు వెళ్లలేదు. డిసెంబర్ 23న ఒక్క రోజు బడికి వచ్చి పోయారు. అయినా ఆమె వేతనం పొందింది. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా సెలవులో ఉంటే నిబంధనల ప్రకారం.. వేతనం ఇవ్వరు. వారి లీవులు పూర్తియి, విధుల్లో చేరినప్పుడు మాత్రమే జీతం తీసుకోవాలి. కానీ సదరు ఉపాధ్యాయురాలు విధులకు హాజరు కాకున్నా.. వేతనం పొందారు. ఉపాధ్యాయులు వేతనం పొందాలంటే వారి పరిధిలోని క్లాంపెక్స్ ప్రధానోప్యాధాయులు సంతకం చేయాల్సి ఉంటుంది. ఆమె విధుల్లో పాల్గొనకున్నా.. తుక్కుగూడ జిల్లా పరిషత్ హెచ్ఎం, కాంప్లెక్స్ హెచ్ఎం కంబాలపల్లి రాములు అనుమతితో వేతనం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సుగణకు హెచ్ఎం రాములు బంధువు కావడంతో వేతనం వచ్చేలా చేశారని ఆరోపిస్తూ.. అతడి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

భూకైలాస్‌లో మహారాష్ట్ర మంత్రి పూజలు


శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న మహారాష్ట్ర మంత్రి సంజయ్‌రాథోడ్ కుటుంబ సభ్యులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం తండా వద్ద ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానం భూకైలాస్‌లో బుధవారం మహారాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి సంజయ్ రాథోడ్ పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్నం 21:30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఇక్కడికి చేరుకున్నారు. ఆలిండియా బంజారా సంఘం అధ్యక్షుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత శంకర్ నాయక్ పవార్, భూకైలాస్ వ్యవస్థాపకులు వాసుపవార్ నాయక్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. 3:20 గంటలకు తిరిగివెళ్లారు. డీఎస్పీ బాలకృష్ణరెడ్డి, సీఐలు సంతోష్, నగేష్, ఎస్ఐ రమేష్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలికాప్టర్‌ను చూసేందుకు జనాలు బారులు తీరారు.

పాంబండ దేవాలయ అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కుటుంబాన్ని సన్మానిస్తున్న ఆలయ పాలకవర్గం, స్థానిక నాయకులు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: పాంబండ ఆలయ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి నియోజకవర్గంలో అత్యంత పురాతన చరిత్ర గల పాంబండ దేవాలయ అభివృద్ధికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి అధిక నిధులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, ఆలయ ఈఓ బాలనర్సయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్దన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాంచంద్రయ్య, భరత్‌కుమార్ రెడ్డి, రాంచందర్ నాయక్, అంజిలయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలి


రాజీవ్ కాలనీలో సమావేశమైన మైనార్టీ హక్కుల పోరాట సమితి నాయకులు

యాలాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్ అన్నారు. బుధవారం మండలంలోని రాజీవ్ కాలనీలో ప్రత్యేక సమావేశం నిర్వహించి టౌన్, నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ నుంచి కార్పొరేషన్ వరకు అన్ని పదవుల్లో ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల అభివృద్ధి 12శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కన్వీనర్‌గా అబ్దుల్ సమీ, టౌన్ కన్వీనర్‌గా మహ్మద్ సాధిక్, నియోజకవర్గ కో కన్వీనర్‌గా అబ్దుల్ వాజిద్, సయ్యద్ మోయిజ్, టౌన్ కో కన్వీనర్‌గా అఖిల్, అఫ్రోజ్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు మహ్మద్ వసీం, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎఫ్ఎస్ సలాం తదితరులు పాల్గొన్నారు.

ఆశలు ఆ‘వరి’!

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- వట్టిపోతున్న బోర్లు
- వరి పంటను వదిలేస్తున్న రైతులు


నీటిమట్టం తగ్గడంతో ఎండిపోతున్న వరిపంట

దౌల్తాబాద్: బోరుబావులను నమ్ముకుని వరి సాగు చేసిన రైతులు బోరుమని విలపిస్తున్నారు. బోరు భాగానే పోస్తుంది. పంట పండుతుందనే ఆశతో యాసంగిలో వరిసాగు చేసిన రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. నీళ్లు అడుగంటిపోతుండడంతో పాటు వేసిన బోరుబావులు వట్టిపోవడంతో పంట దక్కించుకోవడానికి రూ. వేలల్లో ఖర్చు చేసి మళ్లీ బోరువేయించినా నిరాశే మిగులుతుంది. రైతుల ఆరుగాలం కష్టం ఆవిరవుతుంది. పంటలకు నీరు అందక కళ్ల ముందే ఎండిపోతుంటే దిక్కులు చూస్తున్నారు. పంటలను కాపాడుకోవాలనే ప్రయత్నంలో అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలో బోర్ల కింద సాగు చేసిన వరిపంటలకు నీరందక రైతన్న పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

కీలకదశలో నీటికొరత

మండలంలో సుమారు 5వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉంది. ఈ దశ నుంచి గింజలో పాలునింపే వరకు ఎక్కువ మోతాదులో నీరు అవసరం ఉంటుంది. ఈ కీలక దశలో మండలంలోని బోర్లలో నీరు అడుగంటిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది రైతులు ఏమి చేయాలో తోచక పక్క రైతుల బోర్ల నుంచి డబ్బులు వెచ్చించి కొంటున్నారు. కొంత మంది ఎండినపంటలను వృథాగా వదిలేశారు. మరికొందరు పంటలను ఎలా రక్షించుకోవాలని తలలు పట్టుకుంటున్నారు.

ఉష్ణోగ్రత పెరుగుదలతో...

ప్రస్తుత పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువ నమోదవుతున్నాయి. దీంతో బోరుబావుల్లో నీరు అడుగంటిపోతుంది. మండలంలో చాలా గ్రామాల్లో బోర్లపై ఆధారపడి వేసిన వరిపంటలు చేతికి అందే పరిస్థితి కనిపించడంలేదు. ఉష్ణోగ్రతల పెరుగుదల కారణంగా చెరువులు, కుంటల్లోని నీరు ఇంకిపోతున్నాయి. ముందుగా నీటి నిల్వలను బట్టి వేసుకున్న పొలాల్లో పంటలు ఎండిపోవడంతో పశువులను మేపుతున్నారు.

> **నాలుగు బోర్లు వేశా**
>
> 
>
> నాకు రెండు ఎకరాల పొలం ఉంది. పొలంలో వరిసాగు చేద్దామని గతేడాది రెండు బోర్లు వేశాను. చుక్కనీరు రాలేదు. ఈ ఏడాది కూడా రెండు వేస్తే ఒక దాంట్లో కొద్దిగా నీరు పడింది. దాంతో పంట సాగు చేస్తే ఇప్పుడు ఉన్న నీరు కూడా రావడంలేదు. వరి పంట చేతికొచ్చేదాక నమ్మకం లేదు. అప్పులు చేసి బోర్లు వేశాను.
>
> – లక్ష్మని మల్కప్ప, రైతు, దౌల్తాబాద్

> **నాలుగు ఎకరాలు వదిలేశా**
>
> 
>
> మేము ఉమ్మడి కుటుంబంలో ఉన్నాము. యాసంగిలో ఎప్పటికీ 12 బోర్ల కింద సుమారు 20 ఎకరాల్లో వరి సాగు చేస్తాం. ఈ సారి ఎనిమిది బోర్లలో నీటి మట్టం తగ్గాయి. బోర్లలో నీరు లేకపోవడంతో నాలుగు ఎకరాలు వదిలేశాము. ఉన్న పొలం దక్కించుకోవడానికి తంటాలు పడుతున్నాం.
>
> – గోపాల్‌రెడ్డి, రైతు, దౌల్తాబాద్

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్


నిందితులతో మధురానగర్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

వెంగళరావునగర్: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం... మధురానగర్ పీఎస్ పరిసర ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నట్టుగా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పోలీసులు, హెచ్ఎన్ఈడబ్ల్యూ సిబ్బందితో కలిసి పకడ్బందీగా వల పన్నారు. ఈ మేరకు మంగళవారంరాత్రి వెంగళరావునగర్ డివిజన్‌లోని నలందా కళాశాల పక్కన ఉన్న గ్రౌండ్‌లో ముగ్గురు అనుమానితులను పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా 41 కిలోల గంజాయి, రూ.40 వేల నగదు, గంజాయి ప్యాకింగ్ మెటీరియల్ లభించాయి. పోలీసులు వారిని అదుపులోనికి తీసుకుని గంజాయి, నగదు, మెటీరియల్‌ను సీజ్ చేశారు. కాగా, ముగ్గురిలో ఒకరు ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ ప్రాంతానికి చెందిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ బాల హంతాల్‌గా గుర్తించారు. మరో ఇరువురు బుర్రా శ్రీనివాసులు, గోనుగుంట అభిషేక్‌లని, వీరిది కూకట్‌పల్లి ప్రాంతమని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ముగ్గురు నిందితులను బుధవారం కోర్టుకు హాజరుపరిచి, అనంతరం రిమాండ్‌కు తరలించారు.